క్లుప్తంగా

మేజర్ హోదా పొందిన కుమార్‌రాజా



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు, ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కెప్టెన్ పి.కుమార్‌రాజాకు మేజర్ హోదా కల్పిస్తూ న్యూఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సీసీ ఉత్తర్వులు విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మనోహర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ అధికారిగా అందించిన సేవలకు గుర్తింపుగా మేజర్‌గా ఉద్యోగోన్నతి కల్పించారని వివరించారు. న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర పరేడ్‌కు ప్రతి యేటా తమ కళాశాల నుంచి ఇద్దరు, ముగ్గురేసి క్యాడెట్లు ఎంపిక కావడం వెనుక కుమార్ రాజా అందిస్తున్న అత్యుత్తమ శిక్షణ, క్రమశిక్షణ కారణమన్నారు. అదే విధంగా తల్‌సైనిక్ క్యాంపునకు ఇద్దరు ఎన్‌సీసీ కేడెట్లు ప్రాథమికంగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మేజర్ పి.కుమార్ రాజాకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

చేబ్రోలు వాసికి చెన్నై వర్సిటీ పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: చెన్నైలోని శ్రీరామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ నుంచి 'న్యూరో ఎవల్యూషన్ ఆఫ్ న్యూరో సైక్రాటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ ఇన్ బిహేవియర్ మోడ్స్ ఆఫ్ మైస్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలేనికి చెందిన కంచర్ల నాగరాజు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో అసిసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నాగరాజు శ్రీరామచంద్ర వర్సిటీ ఫార్మా విభాగ ఆచార్యులు డాక్టర్ అనూష పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఆయన ఇటీవల పీహెచ్‌డీ పట్టా పొందారు.

జీజీహెచ్ అభివృద్ధికి జింకానా చేయూత



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధి కోసం గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు(జింకాన) అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆస్పత్రి శుశ్రుత హాలులో జింకానా సభ్యుడు డాక్టర్ త్రిపురనేని రవి కుమార్ రూ.15 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను డాక్టర్ కిరణ్‌కుమార్‌కు అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జింకానా వారు అందజేసిన వైద్య పరికరాలు మత్తు వైద్య విభాగం, కార్డియోథొరాసిక్‌కు సంబంధించిన ఆపరేషన్‌కు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం(జింకానా) సభ్యుడు, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ త్రిపురనేని రవి కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలు మాదిరిగా జీజీహెచ్‌లో అందాలన్న ఉద్దేశంతో పరికరాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్డియో థొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, జింకానా కో ఆర్డినేటర్ డాక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి



నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేయకుండా తాత్సారం చేస్తున్నారని జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు ఈమని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం పాతగుంటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ అధ్యక్షుడు ఏసుబాబును అగ్రకులానికి చెందిన వారు కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించిన నేపథ్యంలో గత కొద్ది రోజుల క్రితం పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కాని పోలీసులు 41 సీ కింద స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపివేశారని ఆరోపించారు. అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు అయితే వెంటనే నిందితులను అరెస్టు చేయాలని చట్టం చెబుతున్నా పోలీసుల అధికారులు ఆ దిశగా నిందితులను అరెస్టు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి తోడు అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు నిందితులకు అండగా నిలవడం సమంజసం కాదని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధితుడికి తగిన న్యాయం చేయాలని కోరారు.

లైన్‌లో వేచి ఉండకండి.. ఆన్‌లైన్‌లోకి మారండి

- రైల్వే రిజర్వేషన్ రహిత టికెట్లు ఆన్‌లైన్‌లో లభ్యం
- యూటీఎస్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి
- ఉచితంగా రిజిస్టర్ అవ్వండి
- గుంటూరు రైల్వే స్టేషన్‌లో అవగాహన



యూటీఎస్ మొబైల్ యాప్ లోగో

లక్ష్మీపురం: ప్రస్తుతం ప్రజలు టెక్నాలజీపై మోజు పెరిగింది. రైల్వే శాఖ సాంకేతిక టెక్నాలజీ విస్తృతంగా వినియోగిస్తోంది. దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణికుల సౌకర్యార్థం వినూత్నంగా సేవలు అందిస్తున్నారు. 2018 జూలై 16న దక్షిణ మధ్య రైల్వే ఆన్‌లైన్ టికెట్ల కోసం ప్రయాణికులకు సేవలు అందించేందుకు యూటీఎస్ యాప్‌ను ప్రవేశ పెట్టిన విషయం విధితమే. అయితే ఈ యాప్‌ను అన్ని డివిజన్‌లలో పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రయాణికులకు ఈ యాప్ గురించి అవగాహన కల్పించాల్సిందిగా దక్షిణ మధ్య రైల్వే జీఎం స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గుంటూరు డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ దీన్ని విస్తృతం ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

గుంటూరు రైల్వే స్టేషన్‌లో డివిజన్ సీనియర్ డీసీఎం కమలాకర్ బాబు ప్రయాణికులకు యూటీఎస్ యాప్ గురించి అవగాహన కల్పించి మొబైల్ ఫోన్‌లలో యాప్‌లను డౌన్‌లోడ్ చేసే విధానాన్ని తెలియజేస్తున్నారు. డివిజన్‌లో ఆయా స్టేషన్‌లలో యూటీఎస్ ఆన్‌లైన్ టికెట్ల యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ యాప్‌ను వినియోగించడం వలన ప్రయాణికులకు కాగితంపై వివరాలను రాయాల్సిన అవసరం ఉండదు. ప్రయాణికుడి చేతిలో ఆండ్రాయిడ్ మొబైల్ ఉండి దానిలో ప్లే స్టోర్‌లోకి వెళ్లి యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకుంటే చాలు అన్ని అధికారులు చెబుతున్నారు. రైల్వే అధికారులు కాగితం అక్కరలేని సాధారణ ప్రయాణ టికెట్లు కొనడానికి స్మార్ట్ ఫోన్ ఉపయోగించమని అంటున్నారు. ఈ యాప్ ద్వారా రైల్వే ప్రయాణికులు సీజన్ టికెట్లు, ప్లాట్ ఫారం టికెట్లు కొనుగోలు కోసం యూటీఎస్ యాప్ ఉపయోగించాల్సిందిగా కోరుతున్నారు.

కాగితం అవసరం లేని యూటీఎస్ యాప్



ఈ యాప్‌ను వినియోగం గురించి గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రయాణికులకు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. ఈ యాప్ సాధారణ ప్రయాణ టికెట్లు రైల్వే స్టేషన్ నుంచి 15 మీటర్ల దూరంలో, ప్రయాణం ప్రారంభించే స్టేషన్ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో బుక్ చేసుకోవచ్చు. నగదు రహిత చెల్లింపులతో సాధారణ ప్రయాణ టికెట్లు ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వేలోని ఏ యూటీఎస్ స్టేషన్ నుంచి ఏ స్టేషన్‌కైనా సీజన్, ప్లాట్ ఫారం, సాధారణ ప్రయాణ టికెట్‌లను బుక్ చేసుకోవచ్చు. సీజన్ టికెట్‌ల రెన్యూవల్ పరిధి ముందుగానే చేసుకోవచ్చు. మొబైల్ ఫోన్‌లో సేవ్ అయి టికెట్‌ల బుకింగ్ వివరాలు ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్(టీటీఈ)కు చూపించవచ్చు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా యూటీఎస్ మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేశాం.

– ఎం.రామకృష్ణ, డీఆర్‌ఎం, గుంటూరు డివిజన్

ఆర్-వేలెట్ రీచార్జి ఇలా చేసుకోవాలి

- యూటీఎస్ మొబైల్ యాప్
- డెబిట్ కార్డ్
- నెట్ బ్యాంకింగ్
- వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ యూటీఎస్ ఓఎన్‌మొబైల్.ఐఎన్‌డీఐఏఎన్‌రైల్వే.జీఓవి.ఐన్‌లో కూడా టికెట్స్ పొందవచ్చు.
- రూ.100 నుంచి గరిష్ఠంగా రూ.10 వేల వరకు రీచార్జి చేసుకోవచ్చు. ప్రతి రీచార్జిపై 5 శాతం అదనపు బోనస్ పొందవచ్చు.

టికెట్‌లు బుక్ చేసుకోవడానికి..

- ఆండ్రాయిడ్, విండోస్ లేక ఐఫోన్ స్మార్ట్ ఫోన్ ద్వారా యూటీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలి.
- మొదటి సారి ఉపయోగించే వారు సైన్ అప్ చేయాలి. ఇప్పటికే వినియోగిస్తున్నవారు పాస్‌వర్డ్‌తో నేరుగా లాగిన్ చేయాలి
- డ్రాప్ డౌన్ మెనూ నుంచి స్టేషన్‌ని ఎంపిక చేసుకోవాలి
- తరుచుగా ప్రయాణించే వారు క్విక్ బుకింగ్ ఎంపిక చేసుకోవాలి
- ఆర్-వేలెట్, పేటీఎం, మొబిక్విక్, ఉపయోగించి టికెట్లు కొనుగోలు చేసుకోవాలి.

నగరంలో 58,971 మందికి పెన్షన్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 58,971 మంది పెన్షనర్లకు ఆగస్టు ఒకటో తేదీన నూరు శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేయడానికి తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.శ్యాం సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో పెన్షన్ల పంపిణీ నూరు శాతం పూర్తి చేయడానికి వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. నగరంలోని 206 వార్డు సచివాలయాల పరిధిలోని వివిధ కేటగిరిలకు సంబంధించి 58,971 మంది పెన్షనర్లకు రూ.25,09,96,500లను వారి ఇంటి వద్దనే 1,632 మంది వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా అందించడానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. పెన్షన్‌ల పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణకు 42 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. పెన్షన్ల పంపిణీ విధులు కేటాయించబడిన కార్యదర్శులు ఆగస్టు ఒకటికి ముందే తమకు కేటాయించిన ప్రాంతం, పెన్షనర్ల సంఖ్య(కేటగిరి వారీగా), పంపిణీ చేయాల్సిన నగదు తదితర అంశాలను నోడల్ అధికారి ద్వారా తెలుసుకోవాలన్నారు. పెన్షన్ పంపిణీ ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించాలని, ప్రతి గంటకు పంపిణీ చేసిన శాతం నగరపాలక సంస్థకు తెలియచేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సబ్జెక్టులపై అవగాహనతోనే పోటీ పరీక్షల్లో విజయం

జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ భార్గవ్‌తేజ

నెహ్రూనగర్: పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే సబ్జెక్టులపై పూర్తి అవగాహన, పట్టుదల, క్రమశిక్షణతో చదవగలిగితే విజయం సాధ్యమని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ పేర్కొన్నారు. మంగళవారం రాజాగారితోటలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–2 మెయిన్స్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు హాజరవుతున్న అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలతో పాటు మార్కెట్‌లో లభించే ప్రామాణిక పుస్తకాలను ప్రణాళికాబద్ధంగా అధ్యాయనం చేసి చదివినట్లయితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. ఆయా సిలబస్‌కు సంబంధించిన టెక్ట్స్ బుక్స్‌నే కాకుండా ప్రస్తుతం జరుగుతున్న అన్ని కరెంట్ అంశాలకు సంబంధించిన విషయాలపై పూర్తి అవగాహన కొరకు ప్రతి రోజు తెలుగు, ఇంగ్లిష్ పేపర్స్ తప్పకుండా చదువుతూ సొంత నోట్స్‌ను తయారు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్ష రాసే సమయంలో కష్టంగా ఉన్న బిట్స్‌ను టెక్నికల్‌గా ఆలోచించి ఎవరైతే కరెక్ట్ ఆన్సర్స్ చేయగలుగుతారో వారే అంతిమంగా విజయం సాధించగలుగుతారన్నారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.మధుసూదనరావు, హిస్టరీ ఫ్యాకల్టీ రఫీ, ఇండియన్ పాలిటీ ఫ్యాకల్టీ మార్కండేయులు పాల్గొన్నారు.

కవితా స్రవంతి జీవనరేఖలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మస్తానయ్య

నగరంపాలెం: జీవన రేఖలు పుస్తకంలో రచయిత నూతలపాటి సాంబయ్య పలు ప్రజాహిత విషయాలను ప్రస్తావించారని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం కళావిపంచి(హైదరాబాద్), ఆరాధన అకాడమి(గుంటూరు) ఆధ్వర్యంలో కళాసారథి నూతలపాటి సాంబయ్య కవితా స్రవంతి జీవనరేఖలు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. అనంతరం మస్తానయ్య, అతిథులు పుస్తకావిష్కరణ చేశారు. వెలగపల్లి సాయిపద్మశ్రీ(విజయవాడ) కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో కళాపోషకులు వజ్జా మధుసూదనరావు, కవి సాహితీ విశ్లేషకులు డాక్టర్ బీరం సుందర రావు, విశ్రాంత ఆచార్యులు వాసిరెడ్డి సత్యనారాయణవరప్రసాద్, కవి గ్రంథకర్త నూతలపాటి సాంబయ్య, బండారుపల్లి రామారావు, నర్రా శ్రీనివాసరావు, జంపని కిషోర్‌బాబు, కళావిపంచి అధ్యక్షులు బి.నరసింహారావు, ఆరాధన ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు డి.తిరుమలేశ్వరరావు, జీవీజీ శంకర్, సయ్యద్ జానీబాషా, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

పట్నంబజారు: చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వి.రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. ఈనెల 27న సీతారామ్‌నగర్‌లో నివాసం ఉండే కల్లూరి వేణుగోపాల్ నివాసంలో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్ సమాచారం ఆధారంగా పాత నేరస్తుడే చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. గతంలో పలు కేసులు ఉన్న శివనాగరాజుకాలనీకి చెందిన ఎర్రసాని రాజు అలియాస్ ఇమ్మానియేలు చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. మంగళవారం కాకాని రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజును అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. అదేవిధంగా 2022లో పాతగుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలో చేసిన మరో చోరీకి సంబంధించిన సొత్తు కలిపి రూ. 3.50 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన హెడ్‌కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, నూరుద్దీన్, శామ్యూల్‌రాజు, రాములను సీఐ రమేష్ అభినందించారు. ఈమేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐలు అమరవర్ధన్, భాగ్యరాజు పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌పై దాడి

గుంటూరు ఈస్ట్: అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌పై నలుగురు వ్యక్తులు దాడిచేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కుందుల రోడ్డులోని వైట్‌హౌస్ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేసే దేవభిక్షంపై నలుగురు వ్యక్తులు దాడి చేశారు. పక్క అపార్టుమెంట్‌లోని ఓ మహిళతో దేవభిక్షం అసభ్యంగా ప్రవర్తించాడని వారు భావించి దాడిచేశారు. అనంతరం అసభ్యంగా ప్రవర్తించింది దేవభిక్షం కాదని నిర్ధారించుకున్నారు. దేవభిక్షం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

గుంటూరు ఈస్ట్: అద్దె డబ్బులు అడిగినందుకు ఓ మహిళ ఇంటి యజమానిపై దాడిచేసిన ఘటనపై మంగళవారం చోటుచేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. కన్నావారితోటలో నివాసం ఉండే ఎం.లలిత తన ఇంటిని మహాలక్ష్మికి అద్దెకు ఇచ్చింది. మహాలక్ష్మి కొద్ది నెలలు అద్దె సక్రమంగానే చెల్లించింది. కొన్ని నెలల నుంచి అద్దె చెల్లించలేదని మహాలక్ష్మిని లలిత అద్దె చెల్లించాలని నిలదీసింది. మహాలక్ష్మి లలితపై దాడిచేసి గాయపరిచింది. లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్టోబర్‌లో ఆకాష్ టాలెంట్ టెస్ట్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్(ఏఎన్‌టీహెచ్‌ఈ)2024ను అక్టోబర్ 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆకాష్ ఆకాడమి బ్రాంచ్ హెడ్ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం అమరావతి రోడ్డులో టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ఆకాష్ టాలెంట్ టెస్ట్‌ను దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పరీక్షలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. 8వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు, ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులు రాయవచ్చని చెప్పారు. ఈ టెస్ట్‌లో మొదటి 5 స్థానాల్లో నిలిచిన వారికి ఆకాష్ అకాడమీ సొంత ఖర్చులతో అమెరికాలోని నాసా అనుబంధ సంస్థ జాన్ ఎఫ్ కెనడీ స్పేస్ సెంటర్ సందర్శనకు పంపిస్తామని చెప్పారు. టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు అమరావతిరోడ్డులోని ఆకాష్ కార్యాలయంలో సంప్రదించవచ్చాన్నరు. కార్యక్రమంలో ఏపీ సేల్స్ హెడ్ రవికిరణ్, అకాడమీ డైరెక్టర్ నరేష్, ఏపీ హెడ్ నిశాంత్ మిశ్రా, ఏపీ ఆపరేషన్ హెడ్ అర్జున్, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఖాతాదారుల ఉన్నతికి యూబీఐ కృషి



రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న యూబీఐ రీజనల్ హెడ్ జవహర్, మాజీ మంత్రి ఆలపాటి

కొరిటిపాడు(గుంటూరు): ఖాతాదారుల ఉన్నతికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) కృషి చేస్తోందని ఆ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎస్.జవహర్ తెలిపారు. ఖాతాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా సేవలందిస్తున్నామని చెప్పారు. నగరంపాలెంలోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎంఎస్‌ఎంఈ ఎంపవర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ యూబీఐ ద్వారా సకాలంలో సరళమైన వడ్డీ రేట్లతో పారిశ్రామిక రుణాలను అందిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈ ఎంపవర్ స్కీం కింద రూ. కోటి నుంచి రూ.50 కోట్ల వరకు 50 శాతం కొల్లాటరల్‌తో రుణ సదుపాయం ఇవ్వటం జరుగుతోందని పేర్కొన్నారు. అంతేకాక మహిళలకు తక్కువ మార్జిన్, వడ్డీ రేటు, సెక్యూరిటీతో యూనియన్ నారిశక్తి కింద ప్రత్యేక రుణం మంజూరు చేయటం జరుగుతోందని వివరించారు. అనంతరం పలువురు ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, బ్యాంక్ డెప్యూటీ రీజనల్ హెడ్ జె.అశ్వర్థ నాయక్, బ్యాంక్ ఏజీఎం జితేందర్, రాజేష్, హరేరామ్ షా పాల్గొన్నారు.

నార్ల ఆడిటోరియాన్ని సత్వరమే పూర్తిచేయాలి

ఎమ్మెల్యే మాధవికి విన్నవించిన సీపీఐ నాయకులు



ఎమ్మెల్యే గల్లా మాధవికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్మీపురం: ప్రధానంగా 25 ఏళ్ల కిందట శంకుస్థాపన చేసి కొంత నిర్మాణాన్ని పూర్తి చేసుకొని ఆగిపోయిన నార్ల వెంకటేశ్వరరావు నగరపాల సంస్థ ఆడిటోరియాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిని సీపీఐ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక అశోక్ నగర్ సీపీఐ శాఖ ఆధ్వర్యంలో రెండు పర్యాయాలు స్థానిక ప్రజల నుంచి సంతకాల సేకరణ నిర్వహించి గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌కు విన్నవించినట్లు చెప్పారు. స్పందించిన వారు కొద్దిపాటి మరమ్మతులు అరకొర చేయించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని సత్వరమే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, జిల్లా కమిటీ సభ్యులు మేడా హనుమంతరావు, నగర కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, మంగా శ్రీనివాసరావు, నగర సమితి సభ్యులు ఆకిటి రామచంద్రుడు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరుఈస్ట్: చిట్ డబ్బులు అడిగినందుకు నిర్వాహకుడిని భార్యాభర్త కలసి దాడిచేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సంగడిగుంటకు చెందిన సయ్యద్ మహబూబ్‌సుభాని మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య సిబ్బందిపై సూపర్‌వైజర్‌గా పనిచేస్తుంటాడు. అదే విధంగా చిట్‌లు వేస్తుంటాడు. లక్ష్మీత్రివేణి సుభాని వద్ద పనిచేస్తూ చిట్ వేసింది. చిట్ డబ్బులు చెల్లించలేదు. మంగళవారం సుభాని లక్ష్మీ త్రివేణిని నగరంపాలెంలో డబ్బులు చెల్లించాలని నిలదీశాడు. త్రివేణి భర్త శ్యామ్‌కు ఫోన్ చేసి పిలిపించింది. త్రివేణి, శ్యామ్ ఇరువురు కలసి సుభానిపై దాడిచేశారు. సుభాని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేడ్ 3 ఏఎన్‌ఎంలకు పెన్షన్ల పంపిణీ నుంచి మినహాయింపు ఇవ్వాలి



నెహ్రూనగర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గ్రేడ్– 3 ఏఎన్‌ఎంలకు సామాజిక పెన్షన్ల పంపిణీ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీజీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ శ్యాంసుందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే రోజు వ్యాక్సినేషన్, ట్రెనింగ్ కార్యక్రమాలు, సామాజిక పెన్షన్ కార్యక్రమాలు పంపిణీ ఉండటం వలన మూడు చేయడం సాధ్యపడదని ఇన్‌చార్జి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

వెస్ట్ తహసీల్దారుగా ఫణీంద్రబాబు



గుంటూరు రూరల్: గుంటూరు వెస్ట్ తహసీల్దారుగా ఫణీంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన బాపట్ల నుంచి బదిలీపై గుంటూరు వెస్ట్‌కు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రవీంద్రరెడ్డి బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లపుడూ కృషిచేస్తానని తెలిపారు.

ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా దినేష్‌కుమార్ బాధ్యతలు తీసుకోకపోవడంతో నగరపాలక సంస్థలో పనిచేసే ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు పడే పరిస్థితి లేదని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదుల మూడి మధుబాబు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ కమిషనర్‌గా పనిచేసిన కీర్తి చేకూరి బదిలీపై ఏపీ ట్రాన్స్ కో వెళ్లడంతో గుంటూరు నగర కమిషనర్‌గా దినేష్‌కుమార్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాని ఇంత వరకు నూతన కమిషనర్‌గా దినేష్‌కుమార్ బాధ్యతలు తీసుకోకపోవడంతో నగరపాలక సంస్థ అప్కాస్ కింద విధులు నిర్వహిస్తున్న మూడే వేల మంది ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఎవరైతే కమిషనర్‌గా ఉంటారో వారు సీఎఫ్‌ఎంఎస్ వెబ్‌సైట్‌లో వేలిముద్ర వేస్తేనే ప్రభుత్వం జీతాలు మంజూరు చేస్తుందని వివరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారించాలని విన్నవించారు.

శ్రేష్ట హాస్పిటల్‌లో బ్రెయిన్ ఎన్యురిజంకు చికిత్స



డాక్టర్ నాగార్జున

గుంటూరు మెడికల్: విపరీతమైన తలనొప్పితో బాధపడుతున్న రోగికి బ్రెయిన్ ఎన్యురిజం అసిస్టెట్ వాయిలింగ్ ప్రక్రియ ద్వారా చికిత్స అందించి తలనొప్పి తగ్గించినట్లు శ్రేష్ట హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జున గొట్టిపాటి తెలిపారు. గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్‌లోని తమ హాస్పిటల్‌కు 58 ఏళ్ల మహిళ తీవ్ర తలనొప్పితో చికిత్స కోసం వచ్చిందన్నారు. ఆమెకు వైద్య పరీక్షలు చేసి మెదడులో ఎనిమిది మిల్లీమీటర్ల ఎన్యురిజం ఉందని నిర్ధారించినట్లు చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తమ ఆస్పత్రిలో ఉందని, న్యూరో వాస్క్యులర్ నిపుణులు ఉన్నారని, దీంతో అసిస్టెంట్ వాయిలింగ్ విధానం ద్వారా ఎన్యురిజంను సమర్థంగా క్లోస్ చేశామన్నారు. కార్డియాలజీ, న్యూరాలజీ, పల్మనాలజీ, క్రిటికల్ కేర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, డయాబెటాలజీ, గైనకాలజీ, ల్యాప్రోస్కోపి, ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ వైద్య సేవలు తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. తలనొప్పి తగ్గడంతో రోగిని మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రాలపై వివక్ష

లక్ష్మీపురం: నీతి ఆయోగ్ సమావేశానికి ఏకంగా పది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దూరంగా ఉండటం, వచ్చిన పశ్చిమ బెంగాల్ సి.ఎం మధ్యలోనే వాకౌట్ చేయడం రాష్ట్రాలపై కేంద్రం అనుసరిస్తున్న వివక్షకు నిదర్శనమని సీనియర్ ఇంజినీర్ పి.ఘనశ్యామాచార్యులు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ప్రధాని అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశం ప్రస్తుతం దేశ రాజకీయాల్లో సంచలనం అయిందని తెలిపారు. వివక్ష పాలిత రాష్ట్రాలపై కేంద్రం తీవ్ర వివక్ష చూపటాన్ని ముఖ్యమంత్రులు నిరసించటానికి దీన్ని అవకాశంగా తీసుకున్నారన్నారు. అనంతరం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, రాజకీయ విశ్లేషకులు వి.వి.రావ్, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు ప్రసంగించారు.